క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

క్రమశిక్షణతో సాధన చేస్తే
ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూలై 12 : క్రమశిక్షణతో సాధన చేస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల ఇంటర్ డిస్ట్రిక్ పుట్‌బాల్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కశిరెడ్డి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల నుంచి ఎమ్మెల్యే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందని గుర్తు చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొనడం ద్వారా క్రీడా కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు పొందవచ్చని చెప్పారు. రానున్న రోజుల్లో కల్వకుర్తి క్రీడా హబ్‌గా మారనుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీపీ పల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, పుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భానుకిరణ్, రాజేందర్, విజయ భాస్కర్, చంద్ర జైపాల్, మోహన్, వివేకానంద, వెంకటయ్య, భీమేశ్, రాజు, విజయ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దిమడుగు బస్సు ప్రారంభం

కల్వకుర్తి నుంచి మద్దిమడుగుకు ప్రయాణించే కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించారు. ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసీ పనిచేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలో ప్రమాదకంగా ఉన్న విద్యుత్ వైర్లను ఈ మధ్యనే అధికారులు తొలగించిన నేపథ్యంలో ఎమ్మెల్యేను కాలనీవాసులు అభినందించారు.

ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొల్లాపూర్, జూలై 12 : మండల కేంద్రంలోని ఆశ్రమ గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గిరిజన కమిటీ సభ్యుడు ఆశోక్ గిరిజన సంక్షేమ కమిషనర్ సర్వేశ్వర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గిరిజన ఆశ్రమ పాఠశాలల సమస్యలపై గిరిజన సంక్షేమ కమిషనర్ సర్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఐటీడీఏ పీవో పర్యవేక్షణ లేకపోవడంతో హాస్టల్స్‌లో మెనూ అమలుకావడం లేదన్నారు. హాస్టల్స్‌లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఉన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత

లింగాల, జూలై 12 : సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఇద్దరు వ్యక్తులకు వెతికి శుక్రవారం ఎస్సై జగన్‌మోహన్ అప్పగించారు. మండలంలోని అంబట్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం, లింగాలకు చెందిన శివ రెండు నెలల కిందట సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో ట్రేస్ చేయగా నిందితుల నుంచి రికవరీ చేసి బాధితులకు సెల్‌ఫోన్ అప్పగించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ అప్పగించడంతో బాధితులు ఎస్సై జగన్ మోహన్, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఊర్కొండ, జూలై 12 : అనారోగ్యంతో బాధపడుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఊర్కొండ మండలం రాచాలపల్లిలో చోటుచేసుకున్నది. రాచాలపల్లి గ్రామానికి చెందిన మాడ్గుల ఈదమయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు శుక్రవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియల కోసం రూ.42 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే బీజేపీ నాయకుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి రూ.5వేలను తన అనుచరులతో మృతుడి కుటుంబానికి అందజేశారు.

పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు

చిన్నారులతో ముస్కాన్ టీం సభ్యులు

అమ్రాబాద్, జూలై 12 : బాలలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని ఆపరేషన్ ముస్కాన్ అచ్చంపేట టీం ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని లక్ష్మాపూర్ తండాలో దాడులు నిర్వహించగా పనులు చేస్తున్న ముగ్గురు బాల కార్మికులను గుర్తించి పనుల నుంచి విముక్తి కలిగించి అచ్చంపేట సీడబ్ల్యూసీ ఎదుట ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం చిన్నారులకు చైల్డ్ వెల్ఫేర్‌లో షెల్టర్‌ను ఏర్పాటుచేశామని చిన్నపిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ముస్కాన్ టీం కానిస్టేబుల్స్ రాజా, తిరుపతి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సృజన, చైల్డ్ హెల్ప్ లైన్ మౌనిక, ఎంవీఎఫ్ వెంకటేశ్, ఐసీడీఎస్ సువర్ణ, జాకీర్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో దాతల సహకారం చాలా కీలకం

కల్వకుర్తి రూరల్, జూలై 12 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల సహకారం చాలా కీలకమైనదని మార్చాల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరమణ అన్నారు. శుక్రవారం మార్చాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా టాయిలెట్స్ నిర్మాణానికి గ్రామానికి చెందిన తలసాని లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమార్తె, అల్లుడు సరస్వతి చంద్రశేఖర్ రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, మల్లేశ్, అశోక్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇండ్ల మధ్య మురుగునీరు

- పారిశుధ్యం పట్టని అధికార యంత్రాంగం

తుర్కదిన్నెలో ఇండ్ల మధ్య నిల్వ ఉన్న మురుగునీరు

కోడేరు, జూలై 12 : మండలంలోని తుర్కదిన్నెలో ఇండ్ల మధ్యలో మురుగునీళ్లు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామం నడి బొడ్డు నుంచి పాటు కాలువ ఉన్నందున ఆ నీళ్లు కాలువలో నిల్వ ఉండడంతో మరుగునీళ్లు దుర్వాసన వస్తున్నదని చుట్ట పక్కల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్యం కోసం గ్రామపంచాయతీ వస్తున్న నిధులతో కనీసం మురుగునీరు నిల్వ ఉండకుండా చేయాలని ఎన్నో సార్లు గ్రామస్తులు అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. దీనికి తోడు మురుగునీటి కాల్వలో పాములు సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. మురుగునీరు కాలువలో నిల్వ ఉండకుండా నెలకు ఒకసారైనా శుభ్రం చేస్తే ఈ పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ఎవరు పారిశుధ్యాన్ని గురించి పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు

ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్మన్ శ్రీనివాసులు

అచ్చంపేటరూరల్, జూలై 12 : ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం 14వ వార్డులో ఆయన కమిషనర్ శ్యాం సుందర్, సిబ్బందితో పర్యటించి ప్రజలకు సిజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం మున్సిపాలిటీలో పొడి దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజలు తమ ఇంటి ప్రాంతంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పలు కాలనీల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి చుట్టు పక్కల పరిపరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వాడి పడేసిన కొబ్బరి బొండాలు, సైకిల్, బైక్ ట్యూబు, టైర్లు, డ్రమ్ముల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు ఎండీ సాజిద్, శంకర్, నిరంజన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుపతయ్య, బిల్ కలెక్టర్ ప్రేమ్, నాయకులు చంద్రమోహన్, వెంకటేశ్, దీపక్, జగదీశ్ పాల్గొన్నారు.

అమ్రాబాద్‌లో..

అమ్రాబాద్, జూలై 12 : సీజనల్ వ్యాదులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పదర ప్రాథమిక దవాఖాన వైద్యుడు సుధాకర్ అన్నారు. శుక్రవారం పదర మండలం వంకేశ్వరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రతి రోజు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు అశోక్‌ప్రసాద్, మల్లయ్య, ఆశవర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

అచ్చంపేట టౌన్, జూలై 12 : అచ్చంపేట పట్టణంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులును ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ తరపున శుక్రవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా గౌరవ సలహాదారుడు భీమాచారి, అచ్చంపేట అధ్యక్షుడు నారాయణగౌడ్, శ్రీనివాస్ యాదవ్, పాండు, షరీఫ్, బాలు, అఖిల్, సురేశ్, సాధిక్ ఉన్నారు.

పంటల నమోదు ప్రారంభం

తిమ్మాజిపేట, జూలై 12 : తిమ్మాజిపేట మండలంలో వానకాలంలో రైతులు సాగు చేసిన పంటల సాగు వివరాలను వ్యవసాయాధికారులు నమోదు చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి రైతులు వేసిన పంటలను నమోదు చేసినట్లు వ్యవసాయాధికారి కమల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కరుణాకర్‌కు నివాళి

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 12 : జిల్లా కేంద్రానికి చెందిన విలేకరి కరుణాకర్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలిసిన నాగర్‌కర్నూల్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కరుణాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు అబ్దుల్లాఖాన్, మోహన్, సురేశ్ ఉన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

లింగాల, జూలై 12 : పాఠశాలల ఆవరణలో విరివిగా మొక్కలు నాటాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆయన మొక్కలు నాటే కార్యక్రమంతోపాటు మధ్యాహ్నా భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొక్కలు నాటి దత్తత తీసుకొని ఏపుగా పెంచాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, ఏపీవో హిమాంఅలి, భాగ్యమ్మ ఉన్నారు.

ఎస్సై వీరబాబుకు వినతి

ఊర్కొండ, జూలై 12 : ఓయూలో కవరేజ్ కోసం వెళ్లిన జీ తెలుగు విలేకరిపై దాడికి పాల్పడిన సీఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఊర్కొండ పోలీస్ స్టేషన్‌లో మండలానికి చెందిన విలేకరులు ఎస్సై వీరబాబుకు వినతిపత్రం అందజేశారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సులు ప్రారంభం

చారకొండ : బస్సును ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్

చారకొండ, జూలై 12: మండలంలోని జేపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి, రాంపురం గ్రామాల నుంచి మండల కేంద్రానికి ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును శుక్రవారం మాజీ జెడ్పీటీసీ గుండె వెంకట్‌గౌడ్ మండల కేంద్రంలో ప్రారంభించారు. ఆయా గ్రామాలకు ప్రత్యేక బస్సు ఏర్పాటుకు సహకరించిన అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డినారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఆర్టీసీ బస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్ అంజయ్య, గణేశ్‌గౌడ్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, సత్తార్, శివగౌడ్, చంద్రశేఖర్, అశోక్‌గౌడ్, జనార్దన్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, విజయ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వంగూరులో..

వంగూరు, జూలై 12 : కల్వకుర్తి నుంచి వంగూరు మండలం కొండారెడ్డిపల్లి, పోల్కంపల్లి, చౌదర్‌పల్లి, ఉమ్మాపూర్, గాజరమీదుగా మద్దిమడుగుకు నూతనంగా ఆర్టీసీ బస్సు ప్రారంభమైంది. మండలంలోని ఉమ్మాపూర్‌లో శుక్రవారం మాజీ సర్పంచ్ సుధాకర్‌రావు బస్సు వద్ద పూజలు నిర్వహించి బస్సు ప్రారంభించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

బల్మూరు, జూలై 12 : మండలంలోని చెంచుగూడెంకు అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును ప్రారంభించాలని గిరిజనులు రాజు, సునీల్, శివలు శుక్రవారం కోరారు. గూడెంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ఉందాన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగుతుందన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేక చొరువ తీసుకోని ఆర్టీసీ అధికారులతో మాట్లాడి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

నోట్ పుస్తకాల పంపిణీ

వంగూరు, జూలై 12 : మండలంలోని డిండిచింతపల్లిల్లోని ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన మామిడాల తిరుపతిరెడ్డి 65మంది విద్యార్థులకు ఉచితంగా ఎంఈవో శంకర్‌నాయక్‌తో కలిసి శుక్రవారం నోట్ పుస్తకాలు, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో శంకర్‌నాయక్ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో కుమారి అశ్వినిరెడ్డి, కాంగ్రెస్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు లింగమయ్య, హెచ్ఎం చిన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీర్లకు ప్రత్యేక పూజలు

కోడేరు, జూలై 12 : మండలంలోని వివిధ గ్రామాల్లోని పీర్ల చావిడిలో పీర్లు కొలువుదీరాయి. ఈనెల 17వ తేదీన నిర్వహించే పీర్ల పండుగ సందర్భంగా రెండు రోజులుగా గ్రామాల్లో పీర్ల చావిడిలో ఏర్పాటు చేసిన పీర్లకు భక్తులు పూజలు చేశారు.

కొల్లాపూర్ తాసీల్దార్‌గా
విష్ణువర్ధన్‌రావు

కొల్లాపూర్, జూలై 12: కొల్లాపూర్ మండల నూతన తాసీల్దార్‌గా శుక్రవారం విష్ణువర్ధన్ రావు బాధ్యతలు స్వీకరించారు. కొల్లాపూర్ తాసీల్దార్‌గా పని చేస్తున్న శ్రీకాంత్ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. కొల్లాపూర్ మండల తాసిల్దార్‌గా సమర్థ వంతంగా పని చేసిన శ్రీకాంత్‌ను కార్యాల య సిబ్బంది ఘనంగా సన్మానించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఉప్పునుంతల, జూలై 12 : మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యం శుక్రవారం పట్టుకున్నట్లు ఏఎస్సై సుజనాల తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవి కుమార్‌లు కలిసి అటోను తనిఖీ చేయగా అందులో రెండు క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిపారు. ఉప్పునుంతలకు చెందిన కిషన్ ప్రజల వద్ద కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. డీటీ ఫిర్యాదు మేరకు కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఊర్కొండ, జూలై 12 : మండల పరిధిలోని రౌడీ షీటర్లకు ఎస్సై వీరబాబు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ చేశారు. క్షణికావేశంలో నేరాలు చేయడం వల్ల రౌడీ షీట్లు తెరవపడ్డయని, నేరాలకు పాల్పడవద్దని సూచించారు.

ప్రైవేట్ పాఠశాలలకు
దీటుగా నడపాలి

తాడూరు, జూలై 12 : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడపాలని ఎంఈవో భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని భలాన్‌పల్లి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలను ఎంఈవో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలకు బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని సూచించారు.

ఈజీఎస్ పనుల్లో అవినీతికి చోటులేదు

- డీఆర్డీవో చిన్న ఓబులేశ్

ప్రజావేదికకు హాజరైన అధికారులు

ఉప్పునుంతల, జూలై 12 : మహాత్మాగాంధి జాతీయ ఉపాధిహామీ పథకంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు చోటులేదని డీఆర్డీవో చిన్న ఓబులేశ్ అన్నారు. శుక్రవారం ఉప్పునుంతలలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో మోహన్‌లాల్ అధ్యక్షతన 13వ విడుత సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన 4కోట్ల 99లక్షలకు సంబంధించిన పనులపై 1 జూలై 2024 నుంచి 11 జూలై 2024 వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం చేపట్టిన వివరాలను మండల ప్రజా వేదికలలో సామాజిక తనిఖీ డీఆర్‌వోలు వివరాలను వెల్లడించారు. ఈ వివరాల ప్రకారం ఈజీఎస్ సిబ్బంది తప్పిదాల వల్ల కూలీలు చేసిన పనుల కంటే అదనంగా డబ్బులు చెల్లించడంతో రూ. 61,861 రికవరి, రూ.1.19లక్షల పెనాల్టితో పాటు టీఏలకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు డీఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగేందర్, క్వాలిటీ కంట్రోలర్ కృష్ణారెడ్డి, అధికారులు నజీర్, అర్జున్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, కుర్మారెడ్డి, రవిరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతులివ్వాలి

అచ్చంపేటరూరల్, జూలై 12: ఈనెల 17న ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లమలలో వేలసిన లొద్ది మల్లయ్య దర్శనానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని అంజనీమాత సేవ సమితి గౌరవ అధ్యక్షుడు బాలాజీ శుక్రవారం ప్రకటనలో కోరారు. లొద్ది మల్లయ్య దర్శనానికి ఏకాదశి రోజు అవకాశం కల్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని అధికారులను కోరారు.

పర్యావరణ పరిరక్షణ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

పెద్దకొత్తపల్లి, జూలై 12: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ(పోస్టర్ మేకింగ్)లో మండలంలోని వెన్నచర్ల జెడ్పీ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని శ్రావణి ప్రతిభ కనబరిచింది. జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. ఈ మేరకు విద్యార్థికి సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు ప్రశంసాపత్రంతోపాటు మెమెంటోను అందజేసి అభినందించారు.

పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రమ్య

కొల్లాపూర్, జూలై 12 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం పత్రి శుక్రవారం డ్రైడే డ్రైడేగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్ రహీంపాషా అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారి కోటేశ్వరి, వార్డు ఇన్‌చార్జి భగవాన్, లావణ్య, జమీర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

నాగర్‌కర్నూల్, జూలై 12 : నేషనల్ గ్రీన్ కోర్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోయెట్రీ, పోస్టర్ మేకింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఎన్జీసీ తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు తెలంగాణ నేషనల్ గ్రీన్‌కోర్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకోవడం అనే అంశంపై నాగర్‌కర్నూల్ జిల్లాలోని జాతీయ హరిత దళం క్లబ్ ఏర్పాటు చేసిన పాఠశాలలకు జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్, కవితల పోటీలను శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించినట్లు సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫొద్దీన్, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ వెంకట్, న్యాయ నిర్ణేతలుగా మురళీధర్ రావు, సత్యం పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

వెల్దండ : రాచూర్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉప్పునుంతలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వెల్దండ/ఉప్పునుంతల, జూలై 12 : మండలంలోని రాచూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. స్థానిక పాఠశాలలో ఎనిమిది ఏండ్లుగా బోధించి బదిలీపై వెళ్తున్న హెచ్ఎం వెంకట్‌రెడ్డితోపాటు ఉపాధ్యాయులు నారాయణ, శ్రీనివాస్, జ్యోత్స్న, శ్రీలతను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఉప్పునుంతల మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం పాఠశాల ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పద్మావతి బదిలీపై వెళుతుండడంతో వారిని ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్, కృష్ణబాయి, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాలమణి, వెంకటేశ్, ఆమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
వేలం కోసం బహిరంగ ప్రకటన -తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన
దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటి నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్